# విషమ సంఘటన

శ్రీమతి నందగిరి ఇందిరాదేవి

'ఏమండోయి! ఇవ్వాళయితే తప్పించుకోటానికి వీల్లేదు. ఎన్నాళ్లయింది చూడండి! మనం సరదాగా సినిమాకు వెళ్లక!' అన్నది లీల చిరునవ్వుతో చూస్తూ ప్రకాశంగారితో, తాగిన టీ కప్పు బల్లమీద పెట్టి.

ప్రకాశరావు ఎలక్ట్రిక్ షాకు తగిలినవానికి మల్లే అదిరిపడి అది కప్పిపుచ్చుతో 'పాడుమీటింగు ఇవ్వాళే వచ్చిపడింది క్లబ్బులో. ఇవ్వాళటికి క్షమించు' అని ఒడుదుడుకుగా జవాబుచెప్పాడు, తప్పించుకోవాలన్న ఉద్దేశంతో, బల్లమీది పళ్లెంలోని బీడా వేసుకుని లేస్తూ.

'అబ్బ! ఎప్పుడూ ఉంటాయి మీకు మీటింగులు. నాకు తెలుసునులెండి. నాతో రావటం అంటే మీకు ఇష్టంఉండదు. ఎప్పుడూ ఇదే సమాధానం అని అంటూ ఉండగానే, రాముడు 'అయ్యా!' అని అరిచాడు పరదా అవతలినుండి.

'ఏమిరా?' అన్నది లీల.

రాముడు లోపలికివచ్చి 'అయ్యగారితో అర్జంటుగా మాట్లాడాల్సిన పని ఉన్నదట ఎవరో ఒకాయన వచ్చాడు' అన్నాడు.

ప్రకాశరావు విసుగుకుంటూ 'ఇప్పుడు బయటవెళ్లే సమయమని చెప్పమనలే నీకు ఎవరొచ్చినా కూడా?' అన్నాడు.

రాముడు నీళ్లు నములుతో వెనక్కి వెడుతూ 'అలాగే చెప్పాను కాని తప్పనిసరిగా మాట్లాడాల్సిన పని ఉన్నదని లోపలికివచ్చి కూర్చున్నాడు. ఇప్పుడు కలవటానికి వీల్లేదు అని అంటేకూడా వినిపించుకోటంలేదు'.

'ఎట్లా ఉన్నాడు మనిషి?' అని అడిగాడు ప్రకాశరావు.

'కొంచెం జబ్బుమనిషిలా ఉన్నాడు. చేతికి కట్లు ఉన్నాయి. బక్కగా ఉన్నాడు. ధోవతీ కట్టుకున్నాడు.' అన్నాడు రాముడు.

చేతికి కట్లున్న జబ్బుమనిషి అనేటప్పటికి ప్రకాశం ముఖంలో కళ లేకుండా దిగులు ఆవరించింది. ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలాగా 'ఆ వెధవే అయిఉంటాడు. వీడు నన్ను వొదిలేటట్టు లేడు.' అని అనుకుంటూ డ్రాయింగురూములోకి వచ్చాడు. ఆ కూర్చున్న వ్యక్తి లేచి 'నమస్కారాలు' అన్నాడు. ప్రకాశం అదేదీ వినిపించుకోకుండా 'ఎవరు మీరు? ఎందుకు వచ్చారు? త్వరగా తెమల్చండి' అన్నాడు. అతను కూర్చుని 'నేనెందుకు వచ్చానో నన్ను చూచే తెలుసుకుంటారనుకున్నాను' అన్నాడు.

'మీరెందుకు వచ్చారో మీ మొహాన రాసిలేదు. అందుకని కథ పెంచక నా సమయం వృధా చెయ్యవద్దు' అన్నాడు ప్రకాశం.

ఆ వ్యక్తి 'సరే. మీరింత తీవ్రంగా ఉన్నారు కనుక నేనుకూడా తొందరగానే ముగిస్తాను. రెండునెలలక్రింద రాత్రి సుమారు పదిగంటలప్పుడు జరిగిన విషమ సంఘటన జ్ఞాపకం ఉండొచ్చు. మీరు రాంగుసైడున కారు నడపటంవల్ల నేను మీకారుక్రింద పడటం, నన్ను మీరు హాస్పిటలుచేర్చటం, మీరు ఇంకా మరచిపోలేదనుకుంటా. మీరు అప్పుడు నన్ను చాలా ఆదరించి నాకు అపాయంవల్ల కలిగిన నష్టం నా ఖర్చులు భరిస్తానని వాగ్దానం దయచేశారు. నేను హాస్పిటలులో ఉండగానే మీకు రెండు మూడు ఉత్తరాలు వ్రాసుకున్నాను. కాని మీరు మీ మాటపై నిలబడలేదు. నన్ను నిన్ననే హాస్పిటలునుండి విడుదలచేశారు. నాకు చేస్తానన్న సహాయం అర్థించటానికి, తప్పకుండా లభిస్తుందన్న ఆశతో వచ్చాను.' అంటూ తాను వచ్చిన పని ఏకరువుపెట్టాడు.

ప్రకాశం చాలా నిర్లక్ష్యభావంతో 'నేను నీకు వాగ్దానాలు చెయ్యలేదు. నీకు చేయాల్సిన సహాయం ఇదివరకే చేశాను. ఇక ఆట్టే విసిగించక కదలవచ్చు' అన్నాడు.

యువకునికి చుర్రుమన్నది. అయినా నెమ్మదిగానే 'అయితే అవన్నీ అప్పుడు తప్పించుకోటానికి అన్నమాటలేనా? ఈ అపాయంవల్ల నేను నా పిల్లలు ఎంత కష్టపడ్డామో ఏమన్నా గుర్తించారా?' అన్నాడు.

'అనవసరంగా ఏమిటీ సొద అంతా! నీకు కలిగిన అపాయానికి నేను బాధ్యుడనుకాను. నా కారుకు అడ్డమొచ్చినందువల్ల అనవసరంగా నా ఎంగేజిమెంట్సు అన్ని డిస్టర్బు అయిపొయ్యాయి' అన్నాడు ప్రకాశం.

'అవును! ఆమాత్రం నేను తెలుసుకోలేకపోతే! మీ కారుక్రింద ఒకమనిషి పడిపోయినందువలన ఆనాడు మీరు సినిమాకు వెళ్ళకుండా ఆగిపోవాల్సి వచ్చింది! అయ్యయ్యో! ఎంత ఇబ్బంది!

కాని కొంచెం మీ దృష్టి మావేపు మరల్చిచూడండి. ఇంట్లో సంపాదించేవాడు మూలబడటం, పిల్లలు జబ్బుతో కుంగిపోవటం, ఇంటి ఇల్లాలు పిల్లలను చూసుకుని హాస్పిటలుకు తిరగటం! మీరు ఇలాంటి కష్టాలను ఊహించనన్నా ఊహించగలరా? కార్లల్లో షికార్లుకొట్టే మీకు ఒకమనిషి కారుక్రింద పడటం సామాన్యవిషయంగా తోచింది' అని దులిపేశాడు.

'చూడు అబ్బాయి! నా దగ్గరనుండి నీకు ఏమాత్రం సహాయం లభించదు. నేను చేయదలచుకున్న సహాయం ఆనాడే చేశాను. నాకిప్పుడు చాలా తొందరపనులున్నాయి' అంటూ వెళ్ళిపోబొయ్యాడు ప్రకాశం.

ఆ యువకుడుకూడా లేచాడు. 'సరే! నమస్కారాలు!' అంటూ చరచరా ఇవతలికి వచ్చేశాడు. కొంచెం ఆలోచించి స్థిరనిశ్చయంతో తోటవేపు వెళ్లాడు. తోటలో ఎవరో ఆడమనిషి కనపడగానే కొంచెం సందేహించి మళ్లీ ఆమెను పల్కరించాడు. 'నన్ను దొరసానిదగ్గరకు తీసికొనివెళ్ళగలరా?' అని అడిగాడు.

'ఏ దొరసాని?' అన్నది లీల.

'వారే! ప్రకాశంగారి భార్యగారు.'

'నేనే! ఏంకాలి నీకు?'

యువకుడు కొంచెం ఎగాదిగా చూసి 'మీరేనా? చీరకట్టుకున్నారు కనుక సరిగా గుర్తించలేక పొయ్యాను.'

'అదేమిటి? ఒకనాడు ఫ్రాకులు వేసుకున్నా నా ఏమిటి? యెప్పుడూ చీరకట్టక?'

యువకుడు కొంచెం తొట్రుపాటుతో 'ఆ-అదే-అవును. ఆనాడు ఫ్రాకు వేసుకున్నారు. మీరు నన్ను గుర్తించలేదా?'

'ఏనాడు? ఎవరు నీవు?'

యువకుడు కొంచెం నవ్వాడు.

'మీకయితే అసలే జ్ఞాపకం లేనట్టుంది. రెండునెలల క్రింద. పదిగంటల సమయం అప్పుడు. మీరు మీ భర్త కారులో వెడుతోండగా మీ కారు నామీదినుండి పోయింది. నేను పడిపోగానే మీరు ఎంతో దయతో రక్తాన్ని తుడిచి ఇదుగో ఈ దస్తీతో కట్టుకట్టారు. మీకు నా కృతజ్ఞతను తెలుపటానికి వచ్చాను. నేను ప్రకాశంగారిదగ్గర నా భార్యా పిల్లల కష్టాలు చెప్పుకుని ఏమన్నా డబ్బు సహాయంకోసం వచ్చాను. కాని వారు వెళ్లిపొమ్మని కసరికొట్టారు.'

లీల ఇదంతా విని 'రెండునెలల క్రింద నేనెక్కడున్నాను? అమ్మదగ్గరకు వెళ్లాను కదూ?' అనుకున్నది.

యువకుడు చప్పున సంగతి గ్రహించాడు. ఎంతో అమాయికంగా ఒకగుండీ నొక్కేటప్పటికి దానికి సంబంధించిన మెషీనులన్నీ తిరగటం ఆరంభించాయి. ఆపుదల చేతామనుకున్నా చేయి మించిపోయింది.

'ఆ! అయితే - ఇదంతా పొరపాటు' అంటూ ఏదో గొణిగాడు. కాని లీల అతనిచేతిలోఉన్న దస్తీని లాక్కుంది. దానిమీద 'మేరి'అని కుట్టిఉన్నది. లీలకు అదివరకు భర్తమీద అనుమానాలన్నీ స్థిరపడ్డాయి. తనతో సినిమాకు రావటం అన్నా, తనతో సరదాగా మాట్లాడటం అన్నా భారంగా యుండటం ఇందుకే ననుకున్నది. కోపంతో ముఖంఅంతా ఎర్రబారిరది. డ్రాయింగురూములోకి దారితీసి యువకుణ్ణికూడా వెంటరమ్మని సైగచేసింది.

ఆడుసింహంలా గర్జిస్తూ ప్రకాశందగ్గరికి వెళ్లింది. ప్రకాశం ఈమెనుచూచి వెళ్లిపోవటానికి, ప్రయత్నంచేశాడు. కాని ఆమె "చూడండీ! ఇతనికి నూరురూపాయల చెక్కు వ్రాసి యివ్వండి. అబ్బా! ఎంత దగామాటలు? ఇంకనైనా తప్పు ఒప్పుకుంటారా?" అని చుఱచుఱ చూచింది.